క్లుప్తంగా

ఐదేళ్లలో ఆదాయం పెంపునకు చర్యలు

పెడన: వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంలో భాగంగా రానున్న ఐదేళ్లలో ఆదాయ పెంపునకు ప్రణాళికలు రూపొందించడానికి నియోజకవర్గాల స్థాయిలో వర్క్‌షాపులను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్థానిక గూడూరు రోడ్డులోని దేవాంగ కల్యాణమండపంలో గురువారం జరిగిన వికసిత్ భారత్ పెడన నియోజకవర్గ స్థాయి వర్క్‌షాప్‌నకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బంటుమిల్లికి చెందిన రైతు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే అటు భూసారం పెరగడమే కాకుండా మంచి దిగుబడులు వస్తాయని, ఆరోగ్యకరమైన ధాన్యం వస్తుందని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. వర్క్‌షాపులో డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, సీపీఓ గణేష్ కృష్ణ, పెడన మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, ఎంపీడీవో రెడ్డయ్య, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫొటో ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన

చిలకలపూడి(మచిలీపట్నం): ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ – 2025లో భాగంగా జిల్లాలో ఇంటింటి పరిశీలన చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ తెలిపారు. ఆమె చాంబర్‌లో గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమ షెడ్యూల్‌ను వివరించారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు డోర్ టు డోర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీనిపై తొలుత బూత్‌లెవల్ అధికారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్వో బి.శ్రీదేవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు షేక్ సలార్‌దాదా, బత్తిన దాసు, పంతం గజేంద్ర, కొడాలి శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామసాయి మందిర వార్షికోత్సవం

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులో నిర్మించిన శ్రీ రామ షిర్డీ సాయి మందిరం 17వ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు(బుల్లయ్య), అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్(రాజా) ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని దేవస్థానం చైర్మన్ నంబూరి ఆంజనేయులతో కలసి బుల్లయ్య ప్రారంభించారు. పలువురు నేతలు పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా దోమల నివారణ మందు పిచికారీ

మచిలీపట్నంటౌన్: నగరంలో విషజ్వరాలు పెరిగిపోతుండటంతో నగరపాలక సంస్థ చర్యలు ప్రారంభించింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో నగరంలో ఉన్న పెద్ద ఖాళీ స్థలాల్లో దోమల నివారణ మందును డ్రోన్ ద్వారా పిచికారీ చేయడానికి గురువారం చర్యలు తీసుకుంది. శుక్రవారం కూడా నగరంలో దోమల నివారణ మందును పిచికారీ చేయనున్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వండి

గూడూరు: సేంద్రియ విధానంలో పండించిన పంటలకు ప్రజల ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ విధానానికి రైతులు ప్రాధాన్యమివ్వాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి జి.పార్థసారథి కోరారు. మండలంలోని అనంతాయిపేటలో గురువారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో విచ్చలవిడిగా పురుగుమందులు, రసాయనాలు వినియోగించడం కారణంగా ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రైతుల్లో చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమాలు ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీనివాస్, ఏఓలు శివప్రసాద్, పద్మజ, రైతులు వెంకట రెడ్డి, కుటుంబరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పెడనలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉద్రిక్తం

పెడన: పట్టణంలోని ఆరో వార్డులో అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం రాత్రి ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆరో వార్డులో అంబేడ్కర్ విగ్రహాన్ని రాత్రికి రాత్రి ఏర్పాటు చేయడంతో స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని తెలిపారు. ప్రస్తుతం ఈ విషయం కోర్టులో ఉందని, తరుచు గొడవలు జరుగుతున్న తరుణంలో అక్కడ పికెట్ ఏర్పాటు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయని అన్నారు. ఈ తరుణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రస్తుత పరిస్థితి ఎలా అయితే ఉందో అలాగే ఉంచాలని కోర్టు స్టేటస్ కో ఇవ్వడంతో దళిత సంఘాలకు చెందిన నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున విగ్రహం వద్దకు చేరుకుని పూర్తిగా ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యారు. కోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసులు ఎటువంటి నిర్మాణ చర్యలు చేపట్టకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు. పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రప్రసాద్‌తో పాటు పెడన, బంటుమిల్లి ఎస్ఐలు సత్యనారాయణ, గణేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ గోపాలరావు తదితరులు అవసరమైన చర్యలు తీసుకున్నారు.

ప్రభుత్వ వైద్యులు అంటే గౌరవం లేదు



ప్రభుత్వ వైద్యులు అంటే గౌరవ మర్యాదలు లేవు. అత్యవసర సేవల కన్నా తమకు ప్రాధాన్యమివ్వాలంటూ కొందరు మంచి మర్యాద లేకుండా బెదిరిస్తున్నారు. ఇలా బెదిరింపులు ఉంటే వైద్య సేవలు ఎలా చేయగలం రక్షణ ఉంటుందా. ఎక్కడి నుంచో వచ్చి గ్రామీణ ప్రాంతాల్లో సేవలు చేస్తున్నాం. ప్రభుత్వం రక్షణ ఇచ్చి ధైర్యం కల్పిస్తేనే పేదలకు ధైర్యంగా సేవలు ఇవ్వగలం.

–సౌందర్య, పీహెచ్‌సీ వైద్యాధికారి, బంటుమిల్లి



త్వరితగతిన శిక్షలు పడాలి



కోల్‌కతా ఘటన అమానుషం. ఘటనకు పాల్పడిన దోషులకు త్వరితగతిన శిక్షలు పడాలి. అప్పుడే ఇలాంటి వాటిని నివారించవచ్చు. దేశంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఘటనపై ప్రజల్లో తిరుగుబాటు వచ్చింది. మహిళా వైద్యులపై జరుగుతున్న అఘాయిత్యాలను నివారించడానికి ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాల్సి ఉంది. అప్పుడే ఇలాంటి ఘటనలు పునరావృతం కావు. కొత్త చట్టానికి కోల్‌కతా బాధితురాలి పేరు పెట్టాలి.

– డాక్టర్ బి శ్రీనివాసాచార్య, మచిలీపట్నం

జాతికి భాష ముఖ్యం



బందరులో జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో సాంస్కృతిక ప్రదర్శన



తెలుగు తేజము సంచికను ఆవిష్కరించిన హెచ్ఎం సౌజన్య, ఉపాధ్యాయులు



ఉల్లిపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: మనిషికి శ్వాస.. జాతికి భాష ముఖ్యమని తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా అతిథులు చెప్పారు. గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం నగరంలోని పలు విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. నోబుల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌జే ఎర్నెస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కళాశాల తెలుగు విభాగాధిపతి నాగవాణి మాట్లాడుతూ తెలుగుభాష తియ్యదనాన్ని విద్యార్థులకు వివరించారు. నికోలో కాంటి అనే సందర్శకుడు తెలుగును ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా అభివర్ణించారన్నారు. కార్యక్రమంలో హిందీ విభాగాధిపతి పి.శాంతి, కంప్యూటర్ విభాగాధిపతి శివాజీ, కామర్స్ విభాగాధిపతి గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నేతాజీ మిత్రమండలి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక చిలకలపూడిలోని పాండురంగ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయురాలు మాధవి మాట్లాడుతూ రామ్మూర్తి పంతులు వ్యవహారిక భాషా ఉద్యమానికి చేసిన సేవను వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు దేశ నాయకుల వేషధారణలతో ధరించి ఆకర్షించారు.

బంటుమిల్లిలో..

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. జగన్‌మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితీ విమర్శకులు బొడ్డపట్ల చంద్రశేఖర్ తెలుగు భాష మాధుర్యం, భాషను రక్షించడం కోసం గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన సేవలను వివరించారు. అనంతరం చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ బి. త్రిపురసుందరీదేవీ, వైస్ ప్రిన్సిపాల్ బి.డి. జయరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు నాయకుల వేషధారణలతో కలసి హెచ్ఎం ఎస్. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్థానిక సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సాబూజాన్, ప్రిన్సిపాల్ మేడమ్ ఝాన్సీసాబూ విద్యార్థులతో కలసి



రామ్మూర్తి పంతులు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కోడూరు: స్థానిక బాలభాను విద్యాలయంలో తెలుగు భాషను వివరిస్తూ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఉల్లిపాలెంలో 27 అడుగుల అతిపెద్ద తెలుగుతల్లి విగ్రహం వద్ద వివిధ పార్టీల నేతలు తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు.

- ఉల్లిపాలెంలోని తెలుగు తల్లి విగ్రహం వద్ద కోడూరుకు చెందిన రవితేజ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలు చేశారు.

పెడన: తెలుగు భాషాభివృద్ధి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ ప్రధానోపాధ్యాయురాలు సిద్ధినేని సౌజన్య అన్నారు. చెన్నూరు జెడ్పీహెచ్ఎస్ ప్లస్‌లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. తొలుత గిడుగు రామ్మూరి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల పత్రిక తెలుగు తేజము ఆరవ సంచికను, ఈ–బుక్‌ని ఐఎఫ్‌పీ ప్యానల్‌లోను ఉపాధ్యాయులతో కలిసి హెచ్ఎం ఆవిష్కరించారు. గతేడాది పదో తరగతి తెలుగు సబ్జెక్టులో 91 పైగా మార్కులు సాధించిన 27 మంది విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి అందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పత్రికను రూపొందించిన పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కలిదిండి రాంబాబు, (పత్రిక సంపాదకులు) పరిశే రాజేశ్వరరావు(ఉప–సంపాదకులు), మునగాల పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గూడూరు హైస్కూల్‌లో..



కోడూరు విద్యార్థుల నృత్య ప్రదర్శన

గూడూరు: గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలు, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయని డి.పుష్పలత పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల విద్యాశాఖ అధికారి–2 పి.సుబ్రహ్మణ్యం, హాకీ క్లబ్ కార్యదర్శి పెనుగొండ శ్రీనివాసరావు, పీడీ మత్తి అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కూడా గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మాతృభాషతో ప్రజల్లో చైతన్యం

అవనిగడ్డ: మాతృభాష ప్రజల్లో చైతన్యం నింపుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ తెలుగు తల్లి విగ్రహానికి, గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూమాలలు వేసి నివాళులర్పించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మాతృభాష జ్ఞానాన్ని పెంచుతుందని, కొత్తగా ఆలోచించే మేధాశక్తిని ఇస్తుందన్నారు. సాహిత్య భాష ప్రజలు మాట్లాడే భాషగా ఉండాలని రామ్మూర్తి వాడుక భాషోద్యమాన్ని ప్రారంభించారన్నారు. విద్యా, పాలన రంగాల్లో తెలుగును నిలబెట్టడం ప్రభుత్వ కర్తవ్యమైతే దైనందిన జీవితంలో వాడకాన్ని బట్టి తెలుగు మనుగడ ఉంటుందని తెలిపారు.

కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, పార్టీ ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షులు దిరిశం వెంకట్రావు, కొక్కిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరువారిపాలెం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం తుంగల చంద్రశేఖర్.. గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని క్రీడల ప్రాముఖ్యను విద్యార్థులకు వివరించారు. విద్యతో క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని సూచించారు.



అవనిగడ్డలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

పెడన: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వైద్యసేవల కోసం వచ్చే వారికి త్వరితగతిన సేవలను అందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. ఆమె గురువారం పెడన అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని మూడో సచివాలయం తోటమూల ప్రాంతంలో పరిసరాలను పరిశీలించారు. పలు బోట్ల కొబ్బరిబొండాల్లో నీరు నిల్వ ఉన్న వాటిని పరిశీలించి ఇలాంటివి లేకుండా చూడాలని చెప్పారు. డీఎం అండ్‌హెచ్‌వో పెడన పీహెచ్‌సీని సందర్శించారు. ఓపీ వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు రక్త పరీక్షలు ఎన్ని చేసింది తదితర వివాలను అడిగి తెలుసుకున్నారు. ఓపీ బాగా పెరిగిందని, సిబ్బంది కొరత ఉన్నట్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు.

ఆయిల్ ఇంజిన్ల దొంగలు అరెస్ట్

బంటుమిల్లి: అర్తమూరు గ్రామంలో ఆయిల్ ఇంజిన్లు దొంగిలించిన వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అర్తమూరు గ్రామంలో పలువురు రైతులకు చెందిన ఆయిల్ ఇంజిన్లు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు ఈ నెల 28వ తేదీన ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులకు జయపురం గ్రామానికి చెందిన ఈడె వెంకటనారాయణ, బంటుమిల్లికి చెందిన అంకం నాగేంద్రకుమార్(నాని)ను అనుమానించి అరెస్ట్ చేసి విచారణ చేశారు. వారు చేసిన దొంగతనం అంగీకరించారు. దీంతో వారి వద్ద ఉన్న రెండు ఆయిల్ ఇంజిన్లు, వాటి పనిముట్లు, దొంగతనానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకుని వారిద్దరిపై కేసు నమోదు చేశారు. వారిని కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా రిమాండ్ విధించారు.

విద్యార్థులు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

మచిలీపట్నంటౌన్: విద్యార్థులకు గుడ్ టచ్... బ్యాడ్ టచ్‌పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి తాహెరాసుల్తానా సూచించారు. స్థానిక రుస్తుంబాద మునిసిపల్ బాలికల హైస్కూల్‌లో గురువారం మచిలీపట్నం డివిజన్‌లోని పాఠశాలల ఉపాధ్యాయులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, ఫోక్సో యాక్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎస్ సువర్ణ, ఎంఈవో దుర్గాప్రసాద్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మోపిదేవి: విద్యార్థులు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని, ఉపాధ్యాయులు గమనిస్తుండాలని ఎస్ఐ వైవీవీ సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయులతో గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో దుర్గాసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగాయలంక: నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ఆడిటోరియంలోపోక్సో(ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్)యాక్టు–2012పై అవగాహన సదస్సు నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది బాసు నాంచారయ్య నాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.నిర్మల, ఎంఈఓలు టీవీఎన్ రామదాసు, ఎ.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల: ఎంఈఓ 2 మోమిన్ ఆధ్వర్యంలో ఘంటసాల మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పోక్సో చట్టంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ ప్రతాప్ రెడ్డి, హెచ్ఎం శ్రీరంగవల్లి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

నాగాయలంక: శాంతిభద్రతల పరిరక్షణకే తొలి ప్రాధాన్యమని నాగాయలంక నూతన ఎస్సై కలిదిండ్ రాజేష్ చెప్పారు. ఆయన గురువారం స్థానిక పీఎస్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఇంటెలిజెన్స్ విభాగం నుంచి బదిలీపై ఆయన నాగాయలంక స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన సుబ్రహ్మణ్యంను ఈనెల 4న క

పెడన్ ఎస్ఐగా సత్యనారాయణ

పెడన: పెడన ఎస్ఐగా జి.సత్యనారాయణ గురువారం బాధ్యతలను స్వీకరించారు. అంతకు ముందు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ టి. సూర్యశ్రీనివాస్ చిల్లకల్లుకు బదిలీ అయిన విషయం విదితమే.

'సంక్షిప్త వార్తలు

కేరళ సీఎం సహాయనిధికి విద్యార్థుల వితరణ

పెడన: పట్టణంలోని కళాంజలి హైస్కూల్ యాజమాన్యం పిలుపుతో విద్యార్థులంతా కేరళలోని వయనాడ్ వరద బాధితుల కోసం సీఎం సహాయ నిధికి ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె. దిలీప్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆయాలు, యాజమాన్యం అంతా కలిసి రూ.15వేలను కేరళ సీఎంకు ఆన్లైన్ ద్వారా పంపి, ఎకనాలెడ్జ్మెంట్ పొందారని తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన ఆర్టీసీ సేవలు

అవనిగడ్డ: ప్రయాణికులకు మెరుగైన ఆర్టీసీ సేవలు అందిస్తామని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. అవనిగడ్డ ఆర్టీసీ డిపోలో రెండు నూతన ఆర్టీసీ బస్సులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ ప్రత్యేక పూజలు నిర్వహించి గురువారం ప్రారంభించారు. డీపీటీవో వాణిశ్రీ, డిపో మేనేజర్ హనుమంతరావు, నేతలు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

బంటుమిల్లి: సెప్టెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకుని కక్షిదారులు రాజీ చేసుకునే విధంగా చూడాలని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, న్యాయమూర్తి ఎం. భాస్కరరావు అన్నారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ సభ్యుల(న్యాయవాదులు)తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు సహకరించి రాజీపడ్డ కేసులను లోక్ అదాలత్‌లో పెట్టి పరిష్కారం చేసుకునే విధంగా కక్షిదారులకు అవగాహన కలిగించాలని ఆయన సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ల సోమశేఖర్(శ్యాంబాబు), కుటుంబశాస్త్రి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ

దాలిపర్రు(ఘంటసాల): మహిళలు ఆర్థికాభివృద్ధి చెందడానికి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కూరగాయలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని దాలిపర్రు సర్పంచ్ డోకిపర్తి శాంత కుమారి అన్నారు. ఘంటసాల గ్రామంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఘంటసాల మండలం దాలిపర్రు గ్రామంలోని మహిళలకు కూరగాయలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి, శాస్త్రవేత్త డాక్టర్ బి.నవీన్, మహిళలు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులకు నేత్ర శస్త్రచికిత్సలు

మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆస్పత్రిలో గురువారం హెచ్ఐవీ బాధితులకు నేత్ర శస్త్రచికిత్సలు నిర్వహించారు. నేత్ర వైద్య విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భానుమూర్తి ఐదుగురు హెచ్ఐవీ బాధితులకు కంటి శుక్లాల శస్త్రచికిత్సలు చేశారు. ప్రభుత్వాస్పత్రిలో ఇప్పటి వరకు 15 మంది హెచ్ఐవీ బాధితులకు డాక్టర్ భానుమూర్తి శుక్ల శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఆస్పత్రిలో నీటికాసులు సమస్యకు కూడా వైద్యసేవలు అందిస్తున్నట్లు భానుమూర్తి తెలిపారు.

బెల్టుషాపుపై దాడి.. 40 మద్యం సీసాలు స్వాధీనం

కృత్తివెన్ను: లక్ష్మీపురం గ్రామంలో బెల్టుషాపుపై గురువారం చేసిన దాడిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని నుంచి 40 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పైడిబాబు తెలిపారు. గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న బస్వాని గణపతిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడంతో పాటు, మద్యం సీసాలను సీజ్ చేశామన్నారు. అనధికార మద్యం విక్రయాలు జరిగినా, రవాణా చేసినా చట్ట పరంగా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గూడూరు: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గూడూరు ఎస్సై కె.వి.సత్యనారాయణ అన్నారు. గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం వివిధ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. బాలికల సంరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు.

విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలు తెలుసుకుని రోడ్డుపై ప్రయాణాలు చేసే సమయంలో పాటించాలని కోరారు. ఇటీవల కాలంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలు పాడు చేసుకోవద్దని సూచించారు. ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత, ఎంఈవో–2 పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రకృతి విపత్తుల నుంచి రక్షణ

యండకుదురు(ఘంటసాల): అప్రమత్తతోనే ప్రకృతి విపత్తుల నుంచి బయటపడగలమని ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ టీమ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ పింటు కుమార్ నంది అన్నారు. యండకుదురు పంచాయతీ శివారు జీలగలగండి తుఫాను షెల్టర్ ప్రాంగణంలో విజయవాడకు చెందిన ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ రెస్క్యూ సిబ్బంది యండకుదురు గ్రామస్తులకు ప్రకృతి విపత్తుల పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముళ్లపూడి పట్టాభి రామారావు, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువ క్రీడాకారులు రాణించాలి

అవనిగడ్డ: ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో యువ క్రీడాకారులు రాణించాలని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. అవనిగడ్డ ప్రభుత్వ హైస్కూల్లో జాతీయ క్రీడా దినోత్సవం, ధ్యాన్ చంద్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, కలెక్టర్ బాలాజీ, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించి, బందరు ఆర్డీవో ఎం.వాణి, ఎంపీపీ సుమతి, మండలి వెంకట్రామ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిణి ఝాన్సీలక్ష్మి, డీఈఓ తాహెరాసుల్తానా, జిల్లా ప్రజా రవాణా అధికారిణి వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నగరంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యాలయ ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్, పీడీ బీబీవీ ప్రసాద్, కోచ్ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

కోడూరు: స్థానిక రవితేజ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ర్యాలీ చేశారు. డైరెక్టర్ వల్లభనేని వరప్రసాద్, ప్రిన్సిపాల్ కొరివి అనిల్ కుమార్ కరస్పాండెంట్ కోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో క్రీడా జ్యోతిని వెలిగించి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు అందిస్తున్న కలెక్టర్ బాలాజీ

మంచి చేసే వాళ్లమే.. మర్డర్లు చేసేవాళ్లం కాదు

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్

అవనిగడ్డ: తాము మంచి పనులు చేసే వాళ్లమేకానీ మర్డర్లు చేసే సంస్కృతి కాదని అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసును సీబీఐకి అప్పగించడంతో వాస్తవాలు బయటకు రాకుండా ఉండేందుకు కుట్రలకు తెరతీస్తున్నారన్నారు. తనను రాజకీయంగా అణదొక్కేందుకు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే బుధవారం ఎల్లో మీడియాకు చెందిన ఒక ఛానల్లో (మహా టీవీ)లో గంటల తరబడి డిబేట్‌లు నిర్వహించారన్నారు. హత్య జరిగిన రోజున తాను అక్కడికి వెళ్లి మీడియాతో మాట్లాడానని శ్రీహరిరావు ఆప్త మిత్రుడని సింహాద్రి చెప్పారు. ఈస్ట్ కోస్ట్ ఆక్వా ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో తనతో పాటు శ్రీహరిరావు కొంతమంది పార్టనర్లు ఉన్నారని తెలిపారు. ఒకరోజు శ్రీహరిరావుకు గుండెనొప్పి రాగా అందరి కంటే ముందువెళ్లి విజయవాడ వైద్యశాలలో చేర్పించినట్లు చెప్పారు.



శ్రీహరిరావు హత్య జరిగినప్పటి నుంచి పలుసార్లు జిల్లా ఎస్పీతో మాట్లాడి త్వరితగతిన విచారణ చేయాలని కోరినట్లు చెప్పారు. హత్య జరగడానికి ఆరు నెలల ముందు అపరిచిత వ్యక్తి అతని రూములోకి వెళ్లడానికి ప్రయత్నించినట్లు పోలీసులు వీడియోలు రిలీజ్ చేశారని సింహాద్రి వెల్లడించారు. ఘటనపై నిజా నిజాలు నిగ్గుతేల్చి ఉంటే శ్రీహరిరావు హత్యకు గురయ్యేవాడుకాదన్నారు. త్వరితగతిన విచారణ చేపట్టి శ్రీహరిరావు హత్యకేసులో వాస్తవాలు వెలికితీయాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీ నారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు సామర్ల రామచంద్రరావు రాముడు, చింతలపూడి బాలు, ఎంపీటీసీ తోట గణేష్, కృష్ణారావు పాల్గొన్నారు.

పల్లెల్లో అనారోగ్య సమస్యలు

కృత్తివెన్ను: పల్లెల్లో ఆరోగ్యం పడకేసింది. ప్రతి ఇంట్లో జ్వరాలు, జలుబు, దగ్గులతో ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్ అన్నీ రోగులతో కిటకిటలాడిపోతున్నాయి. చినపాండ్రాక పీహెచ్‌సీలో రోజుకు 60 నుంచి 70 మందికి పైగా రోగులను పరీక్షిస్తున్నట్లు వైద్యులు సూర్యతేజ తెలిపారు. ప్రతి ఒక్కరికి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎక్కువగా టైఫాయిడ్, వైరల్ జ్వరాలు నమోదవుతున్నాయని, వారందరికీ మందులు ఇచ్చి, అవసరమైన వారికి సెలైన్లు ఎక్కిస్తున్నామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com